క్లుప్తంగా

కొరత ఉందని యూరియా వాడొద్దంటారా?

టెక్కలి: సేంద్రియ వ్యవసాయంతో చక్కగా సాగు చేస్తున్న రైతులకు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాల కోసం యూరియాను ప్రోత్సహించి.. ఇప్పుడు కొరత ఏర్పడడంతో ఇప్పటికిప్పుడు వాడకం తగ్గించాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు పేడాడ కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై ఆవేదన వ్యక్తం చేశారు. నాడు యూరియాను ప్రోత్సహించిన పాలకులు ఈ రోజు వాడకం తగ్గించాలని చెప్పడం సబబు కాదన్నారు. రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు అమలపాడు విద్యార్థినులు ఎంపిక

వజ్రపుకొత్తూరు: అమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో వి.వెంకటరమణ తెలిపారు. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా సంవరక్షణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు మండలస్థాయి వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో అమలపాడు విద్యార్థిని డీపీ భాషిత మొదటి స్థానంలో వ్యాసరచనలో వై.కుస్మిత మొదటి స్థానంలో నిలవగా చిత్రలేఖనంలో బి.రేష్మ రెండో స్థానం కైవశం చేసుకుందని ఎంఈవో తెలిపారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థినులతోపాటు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కూన వెంకటరమణను ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ సాయిరాం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన అర్జీలను, ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి కాశీబుగ్గ పోలీసులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. పౌర సంబంధాలు, కుటుంబ, ఆస్తి గొడవలు, మోసపూరిత ఘటనలపై పలువురు ఎస్పీకి వినతులు అందజేసి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ, టెక్కలి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల కోసం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొన్ని వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు.

సందడిగా కాళికాదేవి సంబరం



వీధి నాటకాన్ని తిలకిస్తున్న భక్తులు

కవిటి: బోరివంకలో వెలసిన సిద్ధి కాళీమాత అమ్మవారి సంబర మహోత్సవాలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సంబరం మహోత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక శోభ నెలకుంది.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

మందస: గెద్దవూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కర్రి సుందరరావు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దీంతో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుందరరావు దంపతులను ఎంఈవో-1 లక్ష్మణరావు, ఎంఈవో-2 భాస్కరరావు, హెచ్ఎం నరసింహమూర్తి దుశ్శాలువతో సత్కరించారు. గ్రామ పెద్దలు కోమర గోపాలరావు, అర్లి తాతరావు, పిచ్చుక గోపాలరావు, వంక ధర్మ, పిచ్చు శేఖర్ ఉన్నారు.

తీరిన లోఓల్టేజీ సమస్య

వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామకృష్ణాపురంలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించారు. మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏఈఈ జీవీ రమణ, సిబ్బంది విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి పనులు చేపట్టారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కమిషనర్ నడిపేన రామారావు సూచించారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పొదుపు సంఘాల ఆర్పీలు, వాలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరక్షరాస్యులకు బోధించడానికి అనువుగా 6 రకాల పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని చెప్పారు. మెప్మా సిబ్బంది, ఆర్పీలు, సీఎల్ ఆర్పీలు, వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో సమస్యల కూత!



సౌకర్యాలకు దూరంగా ఉన్న పూండి రైల్వే స్టేషన్

- అస్తవ్యస్తంగా అభివృద్ధి పనులు
- నాణ్యతకు తిలోదకాలు
- నిర్మించిన రెండేళ్లకే శిథిలమైన ప్లాట్‌ఫారాలు

వజ్రపుకొత్తూరు:

ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలోని పూండి నుంచి తిలారు వరకు ఉన్న రైల్వే స్టేషన్లలో సమస్యలు పేరుకుపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొరగా చేస్తున్న అభివృద్ధి పనుల్లో సైతం నాణ్యత లోపిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. చేపట్టిన పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. పూండి, నౌపడ, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, తిలారు రైల్వే స్టేషన్ల ప్లాట్ ఫాంలపై గడ్డి మొలకెత్తడమే కాకుండా ఎక్కడ బడితే అక్కడ కుంగిపోయి శిథిలమైయ్యాయి. తిలారు, పూండి తదితర రైల్వే స్టేషన్లలో రెండేళ్ల కిందట రూ.80.65 లక్షలతో ప్లాట్ ఫాం అభివృద్ధి, ఎత్తు పెంచే పనులను చేపట్టారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆదరాబాదరాగా చేయడంతో మట్టి ఫిల్లింగ్‌లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. దీంతో ఇటీవల, అంతకు ముందుకు కురిసిన వర్షాలకు ప్లాట్ ఫారాలు కుంగిపోయాయి. అమర్చిన పలకలు విరిగిపోగా అందులో నుంచి పచ్చిక మొలకెత్తుతున్నాయి. ఈ పనులపై ప్రయాణికులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క సుమారు రూ.45 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న పూండి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల్లో కూడా నాణ్యత లోపిస్తోందని, ఇంజినీరింగ్ అధికారుల జాడే కరువై, పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పూండిలో ఉద్యోగం చేస్తున్న రైల్వే సిబ్బంది కోసం నిర్మించిన వసత గృహాలు సైతం శిథిలమైనప్పటికీ వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ట్రాక్ మెయింటెనెన్స్, ఇతర కూలీలు సేద తీర్చుకోవడానికి తప్ప మరెందుకూ గృహాలు పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. మరుగుదొడ్లు సౌకర్యం లోపించడంతో డీఎంయూ, ఈఎంయూ రైళ్ల కోసం వేచి చూసే ప్రయాణికులకు బహిరంగ ప్రదేశాలే దిక్కవుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించిన పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని శ్రీకాకుళం ఐఓడబ్ల్యూ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ప్లాట్ ఫాంపై ఉన్న మొలకలను నిత్యం శుభ్రం చేస్తున్నామన్నారు. పనుల పర్యవేక్షణలో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదన్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉందన్నారు. లేనివాటిని పరిశీలించి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.



పూండి రైల్వే స్టేషన్‌లో కుంగిపోయిన ప్లాట్ ఫాం



శిథిలమైన సిబ్బంది వసతి గృహాలు



ప్లాట్‌ఫాంపై మొలకెత్తిన పచ్చిక

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్సీ రామారావుకు మాజీ సీఎం జగన్ సూచన



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రామారావు, చామంతి దంపతులు

కవిటి: శాసన మండలి సమావేశాలలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్సీలతో తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం అయ్యారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో విడివిడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఈసారి పార్టీ జెండా ఎగరాలని.. దీని కోసం అంతా కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని సూచించినట్టు రామారావు చెప్పారు. కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపుతో పాటు భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తానని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో నాయకుల పనితీరుపై ఆరా తీసినట్టు చెప్పారు. గతంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు పార్టీ కోసం ఏ రకంగా పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారన్నారు. వచ్చినటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మండలిలో ప్రాంతీయ సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారన్నారు.

మాజీ సీఎం జగన్ దృష్టికి ఉద్దానం ఉద్యోగుల పరిస్థితి



ఉద్యోగుల పరిస్థితిని జగన్‌కు వివరిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఉద్దానం రక్షిత మంచినీటి ప్రాజెక్ట్ ఉద్యోగుల తొలగింపు విషయాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తీసుకెళ్లారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. 1999 నుంచి పనిచేస్తున్న 105 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడిన విషయాన్ని జగన్‌కు వివరించారు. ఉద్యోగులకు జరిగిన అన్యాయంపై స్పందించిన జగన్ కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేసేందుకు పార్టీ లీగల్ సెల్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఏపీసీ శశిభూషణ్ తదితరులు

ఇచ్ఛాపురం: దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సమగ్రశిక్షా ఏపీసీ ఎస్.శశిభూషణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో కె.అప్పారావు అధ్యక్షతన నియోజకవర్గస్థాయిలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, దివ్యాంగ నిర్ధారణ వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సహితవిద్య కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సాధికారత వైపు అడుగులు వేయాలని అన్నారు. 200 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరవ్వగా.. వీరికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సహితవిద్య కోఆర్డినేటర్ వి.ఉమ, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంఈవోలు ఎస్.విశ్వనాథం, ఎం.ధనుంజయ, చిట్టిబాబు, ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్ఎం కె.సూర్యారావు, అలీమ్‌కో బృందం సభ్యులు రంజిత్, అజిత, నాలుగు మండలాల సహితవిద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో.. ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న దస్తవేజు లేఖర్లు

వజ్రపుకొత్తూరు రూరల్: భూ హక్కు పొందేందుకు చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖరులు కోరారు. ఏపీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు శుక్రవారం కాశీబుగ్గ మున్సిపాలిటీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. భూముల రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటీపీ విధానంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. రిజిస్ట్రేషన్‌లో తప్పులను సరిదిద్దుకునే అవకాశం లేకపోవడంతో భూముల క్రయ విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని, తప్పులను సరిదిద్దుకోనే విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు, దస్తావేజు లేఖర్లు డొంక జయరాం, బి.రవికుమార్, ఆర్.శ్యాం, పి.అప్పలస్వామి, ధనుంజయ, లావేటి గోవిందరావు, శిష్టి శ్రీను ఉన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కంచిలి: ఉల్లాస కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులుగా ఉన్నవారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఉల్లాస్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 3,300 మంది నిరక్షరాస్యు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరికి వలంటీర్లు గ్రామాల్లో శిక్షణ ఇవ్వాల్సిదిగా సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్, ఏపీఎం అప్పలనర్సమ్మ, ఏపీఓ జి.ధనుంజయ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



టెక్కలిలోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన టీఎస్ఎన్ బాబ్జీ దంపతుల ఆధ్వర్యంలో 27 మంది గర్భిణులకు శాస్త్రోక్తంగా సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులతో పాటు స్థానికులు పాల్గొన్నారు. -టెక్కలి

వైద్య శిబిరం



ఇచ్ఛాపురం మండలం కొఠారీ గ్రామంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం, ఏపీ సాక్స్ (జిల్లా ఎయిడ్స్ నియంత్రణ) సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 106 మంది రోగులను పరీక్షించి వారికి మెడీ కవర్ ఆస్పత్రి వైద్యులు చరిష్మా, స్వాతిలు మందులు అందజేశారు. ఏపీ సాక్స్ ప్రత్యేక వాహనంలో 48 మందికి హెచ్‌ఐవీ రక్త పరీక్షలు చేశారు. సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకర్, లింక్ వర్కర్ గున్న రవి, ల్యాబ్ టెక్నీషియన్ వి.లక్ష్మి పాల్గొన్నారు. -ఇచ్ఛాపురం రూరల్

పర్యావరణాన్ని రక్షించాలి



ప్రతిఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాల ఆవరణలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి విద్యార్థులకు ఉద్యానవన మొక్కల విశిష్టతను తెలియజేశారు. వివిధ రకాల మొక్కలను ప్రదర్శించారు. ఇళ్లల్లోని వ్యర్థ పదార్థాలతో ఎరువులను ఎలా తయారు చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. ఎరువులను తయారు చేసి వాటిని మొక్కలకు ఉపయోగించారు. పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరి పాత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.మధు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటరు పి.వెంకటరమణ, సైన్స్ విభాగం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసపట్నాయక్, లైబ్రేరియన్ బి.నరిసింహులు పాల్గొన్నారు. -పలాస

జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని ఇసకలపాలేం గ్రామంలో దేవీ నవరాత్రులు పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పూజా కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.8,001, రూ.6,001, రూ.5001లతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. అలాగే 5, 6, 7, 8 స్థానాలకు రూ.1,000 చొప్పున అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9573574545, 7287003875, 8106946410 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అంతా వారి కనుసన్నల్లోనే..!

- పంచాయతీ దుకాణాల వేలంలో చక్రం తిప్పిన అధికార పార్టీ కార్యకర్తలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీకి చెందిన దుకాణాలను నిర్ణీత కాలానికి హక్కు కోసం శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట స్థానికంగా చర్చనీయాంశమైంది. పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న దుకాణాలు, చిన్నబజారులోని పాత, కొత్తవి కలిపి 57 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో 33 దుకాణాలకు సంబంధించి వేలం పూర్తి కాగా 24 దుకాణాలు పెండింగ్‌లో నిలిచిపోయాయి. అయితే వేలం పాటను తమకు అనుకూలంగా మార్చుకుని కొంతమంది అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి కార్యకర్తలు అంతాతామై వేలం పాటను కొనసాగించారు. దుకాణాల హక్కు కోసం వచ్చిన పలువురు పాటదారులను తమదైన శైలిలో నచ్చజెప్పి వేలం పాటను నామమాత్రంగా కొనసాగించి వారికి అనుకూలమైన వారికి హక్కు వచ్చే విధంగా పావులు కదిపారు. మండల, పంచాయతీ స్థాయి అధికారులు ఉన్నప్పటికీ వారంతా ప్రేక్షక పాత్రకే పరిమితమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ కార్యకర్తలకు అనుకూలంగా ఉన్న వారికే అధికంగా దుకాణాల కేటాయింపు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం దుకాణాలు సొంతం చేసుకున్న వారి వివరాలను అధికారులు బహిర్గతం చేస్తే తప్పా అసలు నిజాలు బయటపడవని స్థానికులు అంటున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలి

పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయికుమార్ మాట్లాడుతూ.. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు. పది మెడికల్ కళాశాలలను కార్పొరేటు వ్యక్తులకు లీజుకివ్వడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఫీజు రియింబర్స్‌మెంటు ఇవ్వక పోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు సోమేష్, రవికుమార్, కరణ్, రాజు పాల్గొన్నారు.

ఏడీఆర్ఎంకు అభినందనలు



రామారావును అభినందిస్తున్న రైల్వే సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామానికి చెందిన కుందు రామారావు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఇటీవల వాల్తేర్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఉద్యోగ ఉన్నతి పొందిన తరువాత తొలిసారిగా స్వగ్రామానికి వచ్చేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు రైలులో శుక్రవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, గ్రామస్తులు, స్నేహితులు సత్కరించి అభినందించారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ శేషమ్మ

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఉన్నత పాఠశాలకు స్థానిక సర్పంచ్ పిట్ట శేషమ్మ, మామయ్య దంపతులు 25 వేల రూపాయల విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. దీన్ని ప్రధానోపాధ్యాయురాలు టి.వి.భార్గవికి శుక్రవారం అందజేసి ప్రారంభించారు.

విద్యార్థులకు అభినందనలు



పలాస: దీత్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



మందస: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పలాస: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పలాస డివిజన్‌స్థాయి ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో కాశీబుగ్గ సాయికాలనీ హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థిని ఎల్.దీత్య అండర్-14 చెస్ విభాగంలో జిల్లా స్థాయికి ఎంపికైంది. దీంతో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను ప్రధానోపాధ్యాయులు డి.కళ్యాణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సి.హెచ్.ఆర్.రామ్‌జీ, ప్రసాదరావు అభినందించారు.

మందస: సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.తారకేశ్వరరావు అండర్-14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం, పి.పూజ షార్ట్ పుట్‌లో, కె.ధర్మాతేజ కబడ్డీ, పి.రాహుల్ అండర్-17 విభాగంలో 1500 మీటర్ల పరుగులో విజయం సాధించారు. దీంతో విద్యార్థులతోపాటు పీఈటీ ఎస్.విజయ్‌ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుందర్ సాల్మన్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నాయకుల పరామర్శ



కవిటి: ఈశ్వరరావును పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ

కవిటి: రాజపురం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు సనపల ఈశ్వరరావు అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఈశ్వరరావును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. రాజపురం ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు ఉన్నారు.



సోంపేట: గొల్లూరులో ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: గొల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి ఝాన్సీ అత్త కామమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబాన్ని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే పాలవలసలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పీతాంబర ఈశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, బొమ్మిడి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుమ్ము డిల్లీరావు, శంకరావు, కె.శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీలు

కంచిలి: మండల స్థాయిలో సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖన పోటీలను ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల విజేతలుగా డి.జి.పురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన అయిధమ్ దీక్ష, పెద్దశ్రీరాంపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.సౌజన్య, వి.కీర్తన, ఎం.ఎస్.పల్లి ఏపీ మోడల్ స్కూల్కు చెందిన వి.కీర్తక, డిబేట్‌లో రోహిణి-సౌమ్య, (జెడ్పీహెచ్ఎస్, డి.జి.పురం), కాంచన- మల్లిక (జెడ్పీహెచ్ఎస్, గోకర్ణపురం), మూడో స్థానంలో ఆరాధ్య-పాణిగ్రాహి (ఏపీ మోడల్ స్కూల్, మఠం సరియాపల్లి), చిత్రలేఖనంలో వరుస మూడు స్థానా ల్లో జి.ప్రజిత (జెడ్పీహెచ్ఎస్, డి.జి.పురం), రాజేశ్వరి శెట్టి (జెడ్పీహెచ్ఎస్, జలంత్రకోట), హెచ్.సంజయ్, ఏపీమోడల్ స్కూల్ (ఎం.ఎస్.పల్లి) గెలుపొందారు.

రైతులకు యూరియా అందించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రభుత్వం యూరియా కొరత నివారించి రైతులకు వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘ జిల్లా నాయకులు బి.రామక్రిష్ణ కోరారు. నగరంపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రైతే దేశానికి వెన్నెముక అని మాట్లాడే నాయకులు అదే రైతు నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. రైతు సంఘ నాయకులు సోమేశ్వరరావు, బి.రాము,బి.లక్ష్మి, బి.భాస్కరరావు ఉన్నారు.